## బతుకు బండి



ఓదెల: మోపెడ్ బండిపై వారసంతకు వెళ్తుతున్న దంపతులు

బతుకు బండిని లాగేందుకు ఓ దంపతులు ద్విచక్ర వాహనాన్ని ఇలా మార్చుకుని చిరు వ్యాపారం చేసుకుంటున్నారు. మోపెడ్ బండికి ట్రాక్టర్ ట్రాలీ మాదిరిగా చేయించి ఇలా అమర్చారు. వారం, వారం గ్రామాల్లో జరిగే వారసంతలకు వివిధ రకాల వస్తువులను ఈ వాహనంపైనే తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఓదెల మండల కేంద్రానికి దంపతులిద్దరూ ఆ వాహనంపై వస్తున్నప్పుడు దృశ్యాన్ని 'నమస్తే తెలంగాణ' తన కెమెరాలో బంధించింది.

**- ఓదెల. డిసెంబర్ 7**



# సీనియర్లకే పట్టం

## మంత్రివర్గంలో శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌కు చోటు

- ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దుద్దిళ్ల
- రెండోసారి అమాత్యుడిగా అవకాశం
- విద్యార్థి నాయకుడి నుంచి ఎదిగిన పొన్నం
- మొదటిసారిగా మంత్రి పదవి
- ఇద్దరికీ కలిసి వచ్చిన అనుభవం, పనితీరు
- కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



ఎలిగేడు : అంబేద్కర్ కూడలిలో సంబురాలు చేసుకుంటున్న నాయకులు

కరీంనగర్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ మంత్రి వర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు సీనియర్లకు చోటు దక్కింది. మంథని అసెంబ్లీ గడ్డపై నుంచి ఐదు సార్లు గెలిచి రికార్డు సృష్టించిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గతంలో ఎంపీగా పనిచేసి ప్రస్తుతం హుస్నాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన పొన్నం ప్రభాకర్‌కు మంత్రి పదవులు ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు వీరిద్దరూ ప్రమాణ స్వీకారం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన శ్రీధర్‌బాబు రెండోసారి బాధ్యతలు చేపట్టగా, ప్రభాకర్ మొదటిసారి అమాత్య పదవి చేపట్టారు. ఈ ఇద్దరి ప్రమాణ స్వీకారం కోసం ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. అలాగే జిల్లాలోనూ సంబురాలు చేసుకున్నారు.

### రెండోసారి అమాత్యుడి శ్రీధర్‌బాబు



స్వర్గీయ ప్రధాని పీవీ నరసింహారావు మంథని గడ్డపై నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలువగా, స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు మూడుసార్లు విజయం సాధించారు. ఒక్క శ్రీధర్‌బాబు మాత్రమే ఐదు సార్లు ఈ ప్రాంతం నుంచి గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డులకెక్కారు. అపార అనుభవమున్న శ్రీపాదరావు వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఆయన, ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తూ వస్తున్నారు. 1999లో మొదటిసారి మంథని నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ సాధించారు. 2014లో ప్రస్తుత బీఆర్‌ఎస్ నాయకులు, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ చేతిలో పరాజయం పాలయ్యారు. తిరిగి పుంజుకున్న శ్రీధర్‌బాబు వరుసగా 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. మంథని గడ్డపైనుంచి ఐదుసార్లు గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు. 2009లో ఆయన ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో పలు శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, లీగల్‌మెట్రాలజీ మంత్రిగా.. శాసనసభ సభా వ్యవహారాలు, ఉన్నత విద్య, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో మంచి పేరు తెచ్చుకున్నారు. మంత్రితోపాటు ఆయన ఆది నుంచీ కాంగ్రెస్‌లో అనేక పదవులు నిర్వర్తించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సమన్వయ కార్యదర్శిగా, 2014 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా, 2004–2006 మధ్యలో తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా, 2004 నుంచి 2009 వరకు ప్రభుత్వ విప్‌గా, 2014 నుంచి 2016 వరకు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణకు చైర్మన్‌గా, 2006 నుంచి 2021 వరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా, 2022 నుంచి ఆలిండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా కొనసాగారు. తాజా ఎన్నికల్లో మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. వీటితోపాటు ఇటీవల జరిగిన కర్ణాటక రాష్ట్ర ఎన్నికల్లో శ్రీధర్‌బాబు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన అనుభవం, పార్టీపై ఉన్న అంకితభావం, పనితీరు వంటివి పరిగణలోకి తీసుకొని మరోసారి మంత్రివర్గంలో చోటు కల్పించినట్టు తెలుస్తుండగా, గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.



### మంత్రి దాకా ఎదిగిన పొన్నం



ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన పొన్నం ప్రభాకర్ ఎటువంటి వారసత్వం లేకుండా స్వశక్తితో అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. ఈ రోజుల్లో ఒక రాజకీయ నాయకుడిగా ఎదగాలి అంటే వెనుక బలమైన శక్తి ఉండాలి. లేదా పూర్తి స్థాయి రాజకీయ నేపథ్యం ఉండాలి. ఇవేవీ లేకుండానే పొన్నం విద్యార్థి నాయకుడి దశ నుంచి మంత్రి వరకు తన రాజకీయ ప్రస్థానాన్ని సాగిస్తూ వచ్చారు. ఈ ప్రయాణంలో ఆయన సొంత పార్టీ నుంచే ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. 1987–88లో శ్రీ రాజరాజేశ్వర డిగ్రీకళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా తన ప్రస్థా నం ప్రారంభించారు. 1987–89లో జిల్లా ఎన్ఎస్‌యూఐ విద్యార్థి ప్రధాన కార్యదర్శిగా, 1989–91లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా, 1992–98లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, 2002–03లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2002–04లో పీసీసీ మీడియా–కోఆర్డినేటర్‌గా, 2005–2009 వరకు ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2009 ఎన్నికల్లో కరీంనగర్ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఆనా టి ఉమ్మడి రాష్ట్ర లోకసభ, రాజ్యసభ ఎంపీల ఫోరం అధ్యక్షుడిగా, రైల్వే కన్సల్‌టేటివ్ కమిటీ సభ్యుడిగా, రసాయనాలు మరియు ఎరువుల కమిటీ స్టాడింగ్ సభ్యుడిగా పనిచేశారు. పదవులతోపాటు ఆయన తెలంగాణ ఉద్యమంలో చురకైన పాత్ర పోషించారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఆది నుంచీ పోరాటం చేసినా ఆయన పలు సందర్భాల్లో అధిష్టానంతో పోరుకు దిగారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితో ఢీ అంటే ఢీ అన్నారు. అధికార పార్టీలో ఉండి తెలంగాణ కోసం పోరాటం చేసిన వారిలో ముందున్న వ్యక్తిగా పొన్నం నిలిచారు. కాగా 2014, 2019 ఎన్నికల్లో ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. అలాగే, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. అదే పార్టీలో కొనసాగుతూ తనవంతు సేవలందిస్తూ వచ్చారు. ప్రస్తుత ఎన్నికల సమయంలో బీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన ఆయన, హుస్నాబాద్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. విద్యార్థి దశ నుంచి రాజకీయ నేపథ్యం ఉండడం, వివిధ హోదాలో పార్టీకి సేవలందించడం, ఎంపీగా ఆయనకున్న అనుభవం వంటివి పరిగణలోకి తీసుకొని మంత్రివర్గంలో చోటు కల్పించగా, తాజాగా ప్రమాణ స్వీకారం చేశారు.



వేములవాడ ఏరియా దవాఖానలో మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్సల కోసం వచ్చిన పేషెంట్లతో వైద్య బృందం

- అందుబాటులో అధునాతన వైద్యం
- అరుదైన శస్త్రచికిత్సలు.. ఆధునిక సేవలు
- ఇప్పటికే 25మందికి మోకీలు మార్పిడి ఆపరేషన్లు
- ప్రైవేట్‌లో లక్షల్లో ఖర్చయ్యే ఆపరేషన్లు పూర్తి ఉచితం
- పేద, మధ్య తరగతి వర్గాలకు తప్పుతున్న ఆర్థిక భారం

# మోకీలు మార్పిడి చికిత్సకు కేరాఫ్

## కార్పొరేట్‌కు దీటుగా వేములవాడ సర్కారు దవాఖాన సేవలు

వేములవాడ, డిసెంబర్ 7: వేములవాడలో ₹22.50కోట్లతో వంద పడకల ఏరియా దవాఖానను భవనాన్ని నిర్మించి, పేదలకు కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు అందిస్తున్నారు. లక్షలాది రూపాయల విలువైన కీలకమైన చికిత్సను పూర్తి ఉచితంగా చేస్తున్నారు. పదుల సంఖ్యలో మోకీలు మార్పిడి ఆపరేషన్లు చేశారు. ప్రైవేట్‌కు మించి ప్రసవాలు కూడా చేస్తున్నారు. ఇంకా కంటి, దంత, ఇతర చికిత్సలను కూడా చేస్తున్నారు. ఈ దవాఖానకు నిత్యం 500 మందికి పైగా వస్తున్నారు. ప్రాణాంతకమైన క్యాన్సర్, పెరలాసిస్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో కదల్లేని స్థితిలో ఏండ్లకేండ్లు మంచానపడ్డవారి కోసం ఇదే దవాఖానలో పాలియేటివ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు.



వేములవాడ ఏరియా దవాఖాన

### మోకీలు శస్త్రచికిత్సలకు కేరాఫ్

ఇప్పటిదాకా మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స అంటే హైదరాబాద్ లాంటి కార్పొరేట్ దవాఖానల్లో మాత్రమే చేసేవారు. కానీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో వేములవాడ ఏరియా దవాఖానలో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడి వైద్య బృందం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 25 మందికి మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చి ప్రభుత్వ దవాఖానలో వైద్య సేవలు పొందుతున్నారు. ఈ శస్త్ర చికిత్సల కోసం మరో 60 మంది రోగులు వెయిటింగ్‌లో ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



వేములవాడ ఏరియా దవాఖానలో మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తున్న వైద్యులు

### 60 మంది వెయిటింగ్‌లో ఉన్నరు

వేములవాడ దవాఖానలో ఇప్పటివరకు 25 మందికి మోకాలు కీలు మార్పిడి చేశాం. ఆపరేషన్లను విజయవంతంగా చేయడంతో రోగులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నడుస్తున్నారు. ఇంకా దవాఖానలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. మోకాలు కీలు మార్పిడి కోసం మరో 60 మంది దాకా ఇప్పటికే వెయిటింగ్ లిస్టులో ఉన్నారు.



**- డాక్టర్ రేగులపాటి మహేశ్ రావు, సూపరింటెండెంట్ (వేములవాడ దవాఖాన)**

### నొప్పి లేకుండా నడుస్తున్న




నాకు ఉండడానికి కనీసం ఇల్లు కూడా లేదు. పదేండ్ల నుంచి ఎడమకాలు మోకాలు నొప్పితో బాధపడుతున్న. కరీంనగర్, హైదరాబాద్ లాంటి నగరాల్లోని దవాఖానల్లో చూపిస్తే రూ.2 లక్షల దాకా ఖర్చయింది. ఇంకా ఖర్చయితయని చెప్పిన్రు. చేతిలో పైసలు లేక ఊరుకున్న. వేములవాడ దవాఖానల్లో ఆపరేషన్లు చేస్తున్నరని తెలిస్తే వచ్చి చేయించుకున్న. మునుపటి లెక్కనే నడుస్తున్న. చాలా సంతోషంగ ఉంది.

**- ఆకుల భారతి, వేములవాడ**

# 'ముందస్తు' దిశగా కేంద్రం అడుగులు


**మార్చిలోనే లోక్‌సభ ఎలక్షన్లు ఉండే చాన్స్?**

- తాజాగా ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాల్లో ఓటరు జాబితా సవరణకు ఆదేశాలు
- జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదుకు అవకాశం
- ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటన



కరీంనగర్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇటీవల ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరాం, రాజస్థాన్, తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించి కౌంటింగ్ ఈ నెల 3న పూర్తయింది. ఇప్పుడిప్పుడే ఆ ఐదు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. కానీ, కేంద్ర ఎన్నికల సంఘం మాత్రం ఈ ఐదు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణకు ఈ నెల 5న రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎన్‌రోల్‌మెంట్ పూర్తయిందని పేర్కొంటూ, ఈ ఐదు రాష్ట్రాల్లోనూ ఓటర్ జాబితా సవరణ పూర్తి కావాలని ఆదేశించింది. అందులో భాగంగా 2024 జనవరి ఒకటి నాటికి 18 ఏండ్లు నిండిన యువతీయువకులు కొత్తగా ఓటు నమోదుచేసుకోవడానికి అవకాశం కల్పించింది. 2024 జనవరి 6న ఓటరు జాబితాకు సంబంధించి పై ఐదు రాష్ట్రాల్లో ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్టు విడుదల చేయాలని ఆదేశించిన కేంద్ర ఎన్నికల సంఘం, అదే నెల 6 నుంచి 22వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించింది. అంతేకాదు, ఈ సమయంలో శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలని పేర్కొంది. వచ్చిన అభ్యంతరాలను ఫిబ్రవరి 2 వరకు పరిష్కరించి చర్యలు తీసుకోవడంతోపాటు తుది జాబితాను ఫిబ్రవరి 8న ప్రకటించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది.

లోక్‌సభ ముందస్తు ఎన్నికలకు కేంద్రం అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తున్నది. ఇటీవల శాసనసభ ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాల్లో ఓటరు జాబితా సవరణ కోసం జారీ చేసిన ఆదేశాలు చేయడం వీటిని బలపరుస్తున్నాయి. తాజాగా, ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు ప్రధాన రాష్ట్రాల్లోనూ బీజేపీ హవా కనిపించడం కూడా అందుకు కారణం కావచ్చున్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



### 'ముందస్తు'కు సన్నాహాలు

ఎన్నికలు ముగిసిన రెండు మూడు రోజుల్లోనే తిరిగి ఓటరు జాబితా సవరణకు కేంద్రం ఆదేశాలు జారీ చేయడం చూస్తే, ముందస్తు ఎన్నికలకు సిద్ధమైనట్లుగా కనిపిస్తున్నది. నిజానికి 17వ లోకసభ ఎన్నికలు 2019 ఏప్రిల్‌లో జరిగాయి. ఈ ఎన్నికలకు సంబంధించి 2019 మార్చి 18న కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో మొత్తం ఏడు దశల్లో ఈ ఎన్నికలను నిర్వహించారు. 2019 ఏప్రిల్ 10న మొదటి దశ లోక్‌సభను ఎన్నికల ను ప్రారంభించిన కేంద్ర ఎన్నికల సంఘం, మే 23 వరకు నిర్వహించింది. ఈ సారి కూడా ఏప్రిల్‌లో ఉండొచ్చని అందరూ భావించారు. కానీ, కేంద్రం మాత్రం మార్చిలోనే ఎన్నికల నిర్వహించే దిశగా అడుగులు వేస్తున్నది. ఓటర్ తుది జాబితాను 2024 ఫిబ్రవరి 8న ప్రకటించాలని ఆదేశాలు జారీ చేయడం చూస్తే, ముందస్తు అభిప్రాయాలు బలపడుతున్నాయి. ఈ లెక్కన ఫిబ్రవరి చివరలోనే కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసే అవకాశముందని విశ్వసనీయ సమాచారం. అందుకే యుద్ధప్రాతిపదికన ఓటరు జాబితా కార్యక్రమాన్ని చేపట్టిందన్న అభిప్రాయాలున్నాయి. ఇదే సమయంలో ఇటీవల ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించింది. మూడు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడంతో బీజేపీ మంచి ఊపు మీదున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంతో పోలిస్తే తెలంగాణలోనూ కొంత ఓటింగ్ శాతం పెరిగిందని, ఇది కూడా ఎంపీ ఎన్నికలకు కలిసి వస్తుందన్న ధీమాతో ఆ పార్టీ ఉన్నట్లుగా తెలుస్తున్నది. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని ఈ జోష్‌లోనే ఎన్నికలకు వెళ్తే బాగుంటుందని ఆ పార్టీ కేం ద్ర నాయకత్వం భావిస్తున్నదని నిపుణులు పేర్కొంటున్నారు. ఫలితంగానే కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా ఓటరు జాబితా సవరణకు ఆదేశాలు జారీ చేసిందన్న అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నా రు. దీంతోపాటు ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధంగా ఉండాలని వచ్చిన ఆదేశాల మేరకు.. ఆయా జిల్లాల కలెక్టర్లు సైతం క్షేత్రస్థాయి అధికారయంత్రాగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. మొత్తంగా కేంద్రం ఓటర్ జాబితా సవరణకు జారీ చేసిన ఆదేశాలను నిశితంగా పరిశీలిస్తే, వచ్చే ఏడాది మార్చిలోనే లోక్‌సభ ఎన్నికలు ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయపడుతుండగా, ఆయా పార్టీలు సన్నద్ధమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.